క్లుప్తంగా

బోరంచ హుండీ ఆదాయం రూ.8.52లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: మనూరు మండలంలోని సుప్రసిద్ధ బోరంచ నల్లపోచమ్మ ఆలయం హుండీ లెక్కింపును శుక్రవారం ఈవో శివరుద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయానికి హుండీ ద్వారా రూ.8,52,769లు ఆదాయం సమకూరింది. మే 1 నుంచి జూన్ 12 వరకు ఆలయంలో ఏడువారాల జాతర అత్యంత వైభవోపేతంగా కొనసాగింది. జాతరకు వచ్చిన భక్తులు అమ్మవారికి కానుకల రూపంలో సమర్పించారని ఈవో శివరుద్రప్ప తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బక్కని కవితకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.28,000 చెక్కును ఎమ్మెల్యే సునీతా రెడ్డి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో లింగాపూర్ గ్రామానికి చెందిన నాయకులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభం



ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీడీఓ రమేష్‌బాబు ప్రారంభించారు. కల్హేర్, కృష్ణాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి శుక్రవారం భూమి పూజ చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీరశెట్టి, నాయకులు తుకారాం, దేవదాస్, ఎండీ.సర్దార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో డ్రైవర్స్‌గా పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డ్రైవర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు గత ఎనిమిదేళ్లుగా సేవలందిస్తూ తక్కువ వేతనంతో పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని తెలిపారు. జీవోలు 60, 63 ప్రకారం డ్రైవర్స్, వాటర్ వర్కర్స్, ఎలక్ట్రీషియన్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని కోరారు. సంఘం నాయకులు సతీష్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు రవి, నాగయ్య పాల్గొన్నారు.

మురికి నీటితో తిప్పలు



జనావాసాల మధ్య నిలిచిన మురికినీరు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వీరభద్రనగర్ కాలనీలో మురికినీరు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కాలనీపై భాగం నుంచి వచ్చే మురికినీరు నివాసాల మధ్య నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని వాపోయారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లు కాదు.. కంకర దారులు

- కంకర తేలి..గుంతలమయమైన రోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు



బురదమయంగా బూచినెల్లి రోడ్డు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజవర్గంలోని పలు గ్రామాల పంచాయతీ రోడ్లు అధ్వాన్నంగా తయారైయ్యాయి. కంకరు తేలి, గుంతలు పడిన రోడ్లపై వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న రోడ్లకు సంవత్సరాల నుంచి మరమ్మతులు కూడా చేపట్టడంలేదు. వర్షం కురిసిన సమయంలో గుంతల్లో నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు అయినా ప్రభుత్వం మారడంతో నిధులు రద్దు అయ్యాయి.

పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు..

జహీరాబాద్ పట్టణం నుంచి అల్గోల్ గ్రామాలను కలుపుతూ వేసిన రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై గుంతలు పడి కంకరుతేలింది. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్- రాంతీర్థం రోడ్డుపై బీటీ, కంకరులేచి అధ్వాన్నంగా తయారైంది. లేచిన కంకరు వాహనాల టైర్లకు గుచ్చుకోవడంతో దెబ్బ తింటున్నాయి. కొన్నేళ్లుగా ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. జాతీయ రహదారి నుంచి బూచినెల్లి గ్రామం వరకు గల రోడ్డుకూడా దెబ్బతింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఇప్పటివరకు పలు ప్రమాదాలు చోటు చేసుకుని ఒకరు ప్రాణాలు కూడా కోల్పోయారు. చినుకుపడితే చాలు చిత్తచిత్తడిగా తయారవుతుంది. ఝరాసంగం మండలంలోని ఎల్గోయి-మొక్కన్‌పాడ్, రాయిపల్లి- కృష్ణపూర్, దేవరంపల్లి, బోప్పన్‌పల్లి, ఝరాసంగం-చిలమామిడి రోడ్లు గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. శంశెల్లాపూర్- వడ్డీ, చాల్కి- కర్ణాటక రాష్ట్ర సరిహద్దు, గంగ్వార్- బసంత్‌పూర్-మామిడ్గి రోడ్లు కూడా దెబ్బతిన్నాయి.



రుక్మపూర్ వద్ద కూరుకుపోయిన లారీ

కోహీర్ మండలంలోని బడంపేట-మనియార్‌పల్లి, పోతిరెడ్డిపల్లి-కోహీర్, పిచరాగడి- పిచరాగడి తండా, ఖనాపూర్-సజ్జాపూర్ , శేఖాపూర్- బడంపేట రోడ్లు దెబ్బతిన్నాయి.

రూ. 51 కోట్లు నిధులు రద్దు

జహీరాబాద్ నియోజకవర్గంలోని పలు గ్రామాల పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.51 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ సకాలంలో పనులు ప్రారంభించకుండా జాప్యం చేశారు. అంతలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ నిధులు కూడా రద్దు అయ్యాయి. రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఇటీవల జహీరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని కోరగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

దివ్యాంగులకు ఉచిత శస్త్రచికిత్సలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో సహారా ఇంక్లూజివ్ ఆస్పత్రిలో అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఉచితంగా ఆపరేషన్ చేయడం అభినందనీయమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం పేర్కొన్నారు. ఉచితంగా ఆపరేషన్ చేసుకున్న విద్యార్థులను శుక్రవారం సహారా ఆస్పత్రి డైరెక్టర్ మఠం శంకరయ్యతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఆస్పత్రిని పెట్టి, ఉచితంగా ఆపరేషన్ చేయడం వలన నిరుపేద దివ్యాంగులకు మేలు జరుగుతుందన్నారు. చిన్న తనంలోనే ఆపరేషన్ చేయడం వలన అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలిపారు. దివ్యాంగులకు వైద్య సేవలు అందించడానికి ముందుకు రావడం మంచి పరిణామమని, దివ్యాంగులు, వృద్ధులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



ఆపరేషన్ చేసుకున్న వికలాంగులను పరామర్శిస్తున్న నాయకులు అడివయ్య, మాణిక్యం

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

పటాన్‌చెరు టౌన్: మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్ జిల్లాలతో పాటు జహీరాబాద్, నారాయణఖేడ్‌లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ గిరిజన పురుషుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సోమనాథ్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9494824692, 8008070959 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సెల్‌టవర్ మాకొద్దు



ఆదర్శ్‌రెడ్డికి వినతిపత్రం అంజేస్తున్న కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీ సీ పార్కులో ఏర్పాటు చేసిన సెల్‌టవర్ తొలగించాలని కాలనీవాసులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాజీ వార్డు సభ్యుడు గిరి, నాయకులు జాషువా, కమలాకర్ మాట్లాడుతూ.. గతంలో సైతం కాలనీలో సెల్‌టవర్ ఏర్పాటు చేశారని, ఆ సమయంలో తాము నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం కాలనీ సొసైటీ అండతో తిరిగి సెల్‌టవర్ ఏర్పాటు చేస్తున్నారని వాపోయారు. అనంతరం ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యను జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

రైతుల సౌకర్యం కోసమే సదస్సు



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

మునిపల్లి(అందోల్): వ్యవసాయ భూముల రికార్డులలో ఎవైనా తప్పులుంటే సరి చేసుకోవడానికి, రైతుల సౌకర్యం కోసమే భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును తహసీల్దార్ సందర్శించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఐటీయూతోనే కార్మికుల సంక్షేమం

అధ్యక్షుడు మల్లేశం

జహీరాబాద్ టౌన్: మంచి వేత ఒప్పందాలు చేయిస్తూ కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు మల్లేశం పేర్కొన్నారు. కోహీర్ మండలంలోని రాకూల్ పరిశ్రమల్లో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ...కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ అండగా ఉన్న కార్మికుల సంక్షేమ కోసం పాటుపడుతున్నామన్నారు. మెరుగైన వేతన ఒప్పదం చేయించి ఇతర సమస్యలను కూడా పరిష్కరించామని చెప్పారు. కార్మికుల కోసం రాజీలేని పోరాటాలను చేస్తామని చెప్పారు. జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ సలహాదారులు మహిపాల్, ప్రధాన కార్యదర్శి నారాయణ, నాయకులు శివరామరావు, సంగమేశ్వర్, నారాయణ, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశం

సంక్షిప్త వార్తలు

◆ **అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు**

సంగారెడ్డి: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందుతాయని టీజీఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు శుక్రవారం మంజూరు పత్రాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ ఇంతియాజ్, హౌసింగ్ పీడీ చలపతిరావు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి**

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కృష్ణాపూర్ రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులు జారీ చేస్తుందని తెలిపారు.

◆ **దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయండి**

పటాన్‌చెరు టౌన్: ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోన్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జూలై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను కార్మిక కర్షకలోకం జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల పార్లే ఆగ్రో పరిశ్రమ ముందు శుక్రవారం జరిగిన కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రామికుల శ్రమను దోచుకునేందుకు వీలుగా ప్రధాని మోదీ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేని పద్ధతి కార్మిక సంఘాలకు ఎందుకని కేంద్రాన్ని ప్రశ్నించారు. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికవర్గం వెట్టి చాకిరిలోకి నెట్టబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, పీఎఫ్ ఈఎస్‌ఐ, బోనస్ వంటి సదుపాయాలు కార్మికులకు అందని ద్రాక్షగా మారుతాయన్నారు.

◆ **బస్టాండ్‌లో పార్కింగ్ చేస్తే చర్యలు**

జోగిపేట(అందోల్): స్థానిక ఎస్‌ఐ, సీఐలు బస్టాండ్ ఆవరణలో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల కార్లు, ద్విచక్ర వాహనాలను తీయించారు. బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేసినట్లయితే జరిమానాలు విధిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు. బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ చేయడం వల్ల కలిగే ఇబ్బందుల గురించి ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురించిన విషయం తెలిసిందే. బస్టాండ్‌లో విధులు నిర్వహించేందుకు ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. ఆర్టీసీ అధికారులు మంత్రి దామోదర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన పోలీసు అధికారులను పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

◆ **దోమల నివారణపై అవగాహన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు దోమల నివారణ, వాటి వలన వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు దోమల నివారణకు కృషి చేయాలని కోరారు. ప్రధానంగా ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణపై కాలనీలలో సైతం ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ **ఏకాభిప్రాయంతోనే ఎన్నుకోవాలి**

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కుర్మ సంఘం అన్ని మండలాల అధ్యక్షుల సమక్షంలో ఏకాభిప్రాయంతోనే జిల్లా కమిటీని ఎన్నుకోవాలని ఆ సంఘం మాజీ జిల్లా కార్యదర్శి కరికె సత్యనారాయణ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఐబిలో కుర్మ సంఘం నాయకులు విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఇటీవలే రహస్యంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా ఎన్నికల్లో పోటీ చేసి మెజార్టీ ఎవరికి ఉంటే వారికే జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొర్రె కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ నాయకులు రాంచెందర్, ప్రసాద్, ఓం ప్రకాష్, కిష్టయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ **పేదల సొంతింటి కల సాకారం**

జిన్నారం(పటాన్‌చెరు): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని పటాన్‌చెరు ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుమ్మడిదల మండలంలోని లక్ష్మాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, ప్రత్యేక అధికారి సురేష్, కార్యదర్శి సంతోషి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీలోనే ప్రయాణం సురక్షితం

నారాయణఖేడ్: ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య కోరారు. శుక్రవారం ఆర్టీసీ ప్రయాణికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో సమావేశం నిర్వహించారు. చాలా కాలంగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్న స్థానిక ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మి, నవ్యలతోపాటు పలువురు ప్రయాణికులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ అందిస్తున్న సేవల గురించి వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, కంట్రోలర్ రాములు, మార్కెటింగ్‌సెల్ ఇన్‌చార్జి పాండు, బస్సుపాసుల కౌంటర్ ఇన్‌చార్జి శివశంకర్, డేవిడ్, అఖిల్ పాల్గొన్నారు.



అధికారిని సన్మానిస్తున్న ఖేడ్ ఆర్టీసీ డీఎం

ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని యోచిస్తున్న కార్మిక కోడ్‌ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. నాలుగు కార్మిక కోడ్‌ల యోచనను నిరసిస్తూ వచ్చేనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. బీజేపీ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక కోడ్‌లను తీసుకురావాలని యోచిస్తోందన్నారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘం ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు సతీష్, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సంయుక్త ప్రైవేట్ పాఠశాలను వదలడంతో విద్యార్థులు యథావిధిగా ఇంటికి చేరేందుకు పాఠశాలకు చెందిన బస్సును ఎక్కారు. వారిని దించేందుకు స్కూలు నుంచి బయల్దేరిన బస్సు సరిగ్గా పోతిరెడ్డిపల్లి చౌరస్తాకు చేరుకుంది. ట్రాఫిక్ సిగ్నల్ కోసం సదరు బస్సు డ్రైవర్ ఎదురుచూస్తున్న క్రమంలో ఓ సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ట్రక్కు అతివేగంగా వచ్చి స్కూల్ బస్సును, పక్కనే ఆగి ఉన్న రెండు కార్లను ఢీకొట్టింది. దీంతో అక్కడ కొద్దిసేపు భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్కూల్ బస్సు బాగా దెబ్బతిని ముందుకు కదల్లేకపోతుండటంతో విద్యార్థులను మరో బస్సులో ఇళ్లకు పంపించారు. ఈ ప్రమాదంలో విద్యార్థులెవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ఈ మేరకు సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను శుక్రవారం ఆయన నివాసంలో బీహెచ్‌ఈఎల్ ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్. రత్న ప్రసాద్ తెలిపారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ విభాగాలు, యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఇందులోభాగంగా విద్యార్థులకు స్లోగన్, పోస్టర్ పెయింటింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..మాదక ద్రవ్యాలు వ్యక్తుల మానసిక, శారీరక ఆరోగ్యాలపై దుష్ప్రభావాన్ని చూపుతాయన్నారు. యువత గంజాయి, హెరాయిన్ వంటి వాటిని వాడటం లేదా అమ్మకాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే 1908 కు సమాచారం అందించాలన్నారు.

క్రీడలు శారీరక ఆరోగ్యానికి తోడ్పడతాయి

అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ ఖాసీం బేగ్ మాట్లాడుతూ..క్రీడలు వ్యక్తుల మానసిక ప్రశాంతంతోపాటు శారీరక ఆరోగ్యానికి తోడ్పడతాయన్నారు. విద్యార్థుల్లో క్రీడలపై అవగాహన కల్పించేందుకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ వంటి పోటీలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయకుమార్, డాక్టర్ వాణి ఇతర అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



తారా కళాశాలలో మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలో వన మహోత్సవం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు సునీత, నవనీత, పంచాయతీ కార్యదర్శి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం రామకృష్ణ

పూర్తికావొచ్చిన పుస్తకాల పంపిణీ

పాఠశాలల్లో నోట్ బుక్స్, యూనిఫాంల అందజేత

జహీరాబాద్ టౌన్: జిల్లాలో పాఠ్యపుస్తకాల పంపిణీ కొనసాగుతుంది. ఇప్పటి వరకు 90 శాతం వరకు పంపిణీని పూర్తి చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచే ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందించడం ప్రారంభించారు. గోదాంల నుంచి పాఠ్యపుస్తకాలు నేరుగా ఎమ్మార్సీలకు వచ్చాయి. అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. గతేడాది పంపిణీలో ఆలస్యం కావడంతో ఈసారి అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎమ్మార్సీలకు 5,39,84 పాఠ్యపుస్తకాలు చేరాయి. వీటిని జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేయడం ప్రారంభించారు. ఇప్పటివరకు 4,76,580 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. 4,17,350 నోట్‌బుక్స్ రాగా ఇప్పటివరకు 3,65,123 పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలను ఎమ్మార్సీస్ కార్యాలయం నుంచి పాఠశాల సిబ్బంది బడులకు చేరవేస్తున్నారు. నోట్‌బుక్స్ మాత్రం వాహనాల్లో నేరుగా పాఠశాలలకు తరలించారు. అయితే ఇంకా కొన్ని సబ్జెక్ట్ పుస్తకాలు సరఫరా లేక పంపిణీ చేయలేదని తెలిసింది. యూనిఫాంలు మాత్రం పాఠశాల ప్రారంభం రోజు పంపిణీ చేయలేదు. తర్వాత పంపిణీ చేయడం ప్రారంభించారు. ఇప్పటివరకు జిల్లాలో 62,289 జతల ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందజేశారు. యూనిఫాంలు అందజేసినప్పటికీ కొన్నిచోట్ల లూజ్‌గా ఉండటంతో విద్యార్థులు ధరించలేకపోయారు. ఈ విషయం జిల్లా విద్యాధికారి దృష్టికి వెళ్లగా స్పందించిన ఆయన వదులుగా ఉన్న డ్రెస్‌లను సరిచేయించారు.



జహీరాబాద్ ఎమ్మార్సీస్ కార్యాలయంలో పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలు